
సాక్షి ఒడిశా

మంగళవారం । 24 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,43,131లు వచ్చాయని అధికారులు తెలిపారు.





విజిలెన్స్ వలలో..

విజిలెన్స్ వలలో సీడీపీఓ, క్లర్క్ పడ్డారు. లంచం తీసుకుంటూ దొరికిపోయారు.

- 8లో



ట్రైనీ ఓఏఎస్‌ల పర్యటన

ఓఏఎస్ ట్రైనీలు కొరాపుట్‌లో పర్యటించారు. స్థానిక అధికారులతో మాట్లాడారు.

- 8లో

న్యూస్‌రీల్

పురాతన మందిరం నేలమట్టం



పాత మందిరాన్ని విరగ్గొడుతున్న కార్మికులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న వందేళ్ల పురాతన గ్రామదేవత ఠకురాణి మందిరాన్ని నేలమట్టం చేస్తున్నారు. ప్రభుత్వ ఆర్థిక సహకారంతో పాటు భక్తులు విరాళాలు సుమారు 50 లక్షల రూపాయలతో అదే స్థానంలో నూతనంగా ఠకురాణి మందిరాన్ని నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పాత మందిరాన్ని విరగ్గొట్టే పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. సుమారు 40 అడుగుల ఎత్తులో నిర్మితమవనుంది. ఇందులో భాగంగా అమ్మవారి గర్భగుడితో పాటు భక్తులు దర్శనం అనంతరం సేద తీరేందుకు ప్రత్యేకమైన మండపం, అలాగే అమ్మవారి పూజా సామగ్రిని భద్రపరిచే మరో గదిని నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని మందిర కమిటీ సభ్యులు తెలిపారు.

రాష్ట్రానికి తొలి స్వర్ణం



శ్రుతి ఉపాధ్యాయ్

భువనేశ్వర్: స్థానిక కళింగ స్టేడియంలో 78వ సీనియర్ జాతీయ జల క్రీడల చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో రాష్ట్రానికి తొలి స్వర్ణ పతకం దక్కింది. 100 మీటర్ల బటర్‌ఫ్లై మహిళా ఈవెంట్‌లో ఒడిశాకు చెందిన ఏస్ స్విమ్మర్ శ్రుతి ఉపాధ్యాయ్ బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఆమెను రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యేకంగా అభినందించారు.

చిరిగిన జాతీయ పతాకం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా జయపూర్ పట్టణంలో ట్రాఫిక్ జంక్షన్ వద్ద ఉన్న భారీ జాతీయ పతాకం చిరిగిపోయింది. ఇది గమనించిన వారు సోషల్ మీడియాలో భారీ ఎత్తున ట్రోలింగ్ చేశారు. వెంటనే అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన మార్పించారు. వంద అడుగుల ఎత్తులో 20 అడుగుల వెడల్పు, 30 అడుగుల ఎత్తులో ఈ పతాకం ఏర్పాటు చేశారు. పతాకం నిర్వాహకుడు నిసాన్ పట్నాయక్ మాట్లాడుతూ రాత్రి కురిసిన భారీ వర్షం వల్ల పతాకం చిరిగిందన్నారు. తాము అది గమనించే సరికే సోషల్ మీడియా వచ్చిందని, వెంటనే మార్చామని ప్రకటించారు.

గణితంలో అత్యున్నత పరిశోధనలకు మద్దతు



గ్రంథాలయ భవనం శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కృష్ణ చంద్ర పాత్రో

భువనేశ్వర్: నగరం శివార్లులో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ అప్లైడ్ సైన్సెస్ కొత్త గ్రంథాలయ భవనానికి రాష్ట్ర విజ్ఞానం, సాంకేతిక శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో సోమవారం శంకుస్థాపన చేశారు. గణితంలో అత్యున్నత పరిశోధనలను నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలను అందించడానికి కట్టుబడి ఉందని, ఆయన అన్నారు. గణితంలో అధిక నాణ్యత పరిశోధనలు, పాఠశాల, కళాశాల స్థాయిలలో గణిత విద్యపట్ల ఆసక్తి ప్రేరణ, ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరాలను నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని అన్నారు. కొత్త గ్రంథాలయ భవనం సుమారు రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో మొదటి దశలో ఉపాధ్యాయులకు వసతి, హాస్టళ్లు, తరగతి గదులు నిర్మిస్తారు. నగరంలో 100 ఎకరాల స్థలంలో సైన్స్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రానున్న ఐదేళ్లలో బయోటెక్నాలజీ కింద 17 ప్రధాన రంగాలలో రూ. 1113 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా విజ్ఞానం, సాంకేతిక విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ చిత్ర అరుముగం మాట్లాడుతూ మానవాళి సంక్షేమం కోసం గణితాన్ని మరింత పరిశోధనలకు అన్వయించాలని విద్యార్థులకు సూచించారు. రానున్న ఐదేళ్లలో అప్లైడ్ మ్యాథమెటిక్స్, మ్యాథమెటిక్స్ విత్ కంప్యూటింగ్, మ్యాథమెటిక్స్ విత్ డేటా సైన్స్, మ్యాథమెటిక్స్ విత్ కంప్యూటేషనల్ ఫైనాన్స్, మ్యాథమెటిక్స్ విత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కోర్సులను ఈ సంస్థ ప్రారంభిస్తుందని ఆమె తెలియజేశారు.

సంక్షేమ కార్యక్రమాల్లో..
ప్రజా భాగస్వామ్యం ప్రధానం



అవగాహన సమావేశంలో పాల్గొన్న రాజ్ భవన్ సిబ్బంది, అధికారులు.

● గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: ప్రజా భాగస్వామ్యంతో ప్రభుత్వ ఆశయం నెరవేరి సాధికార సమాజం వెలుగులోకి వస్తుందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రసంగించారు. ప్రభుత్వ మద్దతుతో నడిచే సామాజిక సంక్షేమ పథకాల్లో పౌరుల నమోదు తక్కువగా ఉండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం రాజ్ భవన్ అధికారులు, సిబ్బందిని నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను గవర్నరు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక ఉదాహరణగా నిలిచి ప్రజలకు అవగాహన కల్పించడంలో ఉదాహరణగా ఈ కార్యక్రమం కొనసాగాలని ప్రోత్సహించారు. రాజ్ భవన్ ప్రాంగణం నూతన అభిషేక్ హాల్‌లో సామాజిక భద్రతా పథకాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత ప్రభుత్వం అనేక ప్రజా కేంద్రీకృత సంక్షేమ పథకాలను ప్రారంభించిందన్నారు. ఈ పథకాలలో చాలా వరకు పేదలు, దుర్బలులు, అణగారిన వర్గాలకు ఆర్థిక రక్షణ, సంక్షేమ ప్రయోజనాలను విస్తరించడం లక్ష్యంగా పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో అర్హత ఉన్న వారిలో ఎక్కువ మంది అవగాహన లేకపోవడం వల్ల ప్రయోజనాలను పొందడం లేదు. విద్యావంతులు, ఉన్నత వర్గాలలో కూడా, పథకాల గురించి అవగాహన ఉన్నప్పటికీ చాలా మంది నమోదు చేసుకోవడం లేదన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి అనేక ప్రధాన పథకాలను గవర్నర్ సూచించారు. ప్రజలు తమ ఆర్థిక భద్రత మరియు శ్రేయస్సు కోసం ఈ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విస్తృతమైన అవగాహన కల్పించడానికి కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ప్రచార కార్యక్రమాల ప్రాముఖ్యతను తెలియజేశారు. భారతీయ స్టేట్ బ్యాంకు రాజ్ భవన్ బ్రాంచ్ బ్రాంచ్ మేనేజర్ సునీతా బెహరా ఈ కార్యక్రమంలో వివిధ పథకాల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ 101 మంది రాజ్ భవన్ సిబ్బంది సభ్యుల దరఖాస్తు ఫారాలను సంబంధిత పథకాలలో నమోదు కోసం భారతీయ స్టేట్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్‌కు అందజేశారు. రాష్ట్ర క్రైమ్ శాఖ పోలీసు డైరెక్టర్ జనరల్ వినయ్‌తోష్ మిశ్రా, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. బి. ఎస్ రాజ్‌పుట్, ప్రత్యేక టాస్క్‌ఫోర్సు డీజీ పినాక్ మిశ్రా, రాజ్ భవన్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



గవర్నర్ ప్రసంగం

హత్యకి దారి తీసిన అక్రమ సంబంధం



దేవేంద్ర మృతదేహంతో అంతిమ యాత్ర జరుగుతున్న దృశ్యం

కొరాపుట్: అక్రమ సంబంధం హత్యకి దారి తీసింది. సోమవారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి పక్కజొల గ్రామ పంచాయతీ డొలయిగుడ గ్రామానికి చెందిన కునా గోలారి డొలొయి గుడ గ్రామానికి చెందిన దేవేంద్ర కుందారియా (35)ని హత్య చేశాడు. గతంలో కునా గోలారి,దేవేంద్ర కుందారియాలు స్నేహితులు. ఈ చనువుతో దేవేంద్ర తరచూ కునా ఇంటికి వెళ్లి వస్తుండేవాడు. కాలక్రమేణా కునా సతీమణితో అక్రమ సంబంధం ఏర్పడింది. దాంతో ఆమె దేవేంద్రతో వెళ్లి పోయింది. మళ్లీ పెద్దలు జోక్యం చేసుకొని నచ్చజెప్పడంతో కునా ఇంటికి తిరిగి వచ్చింది. అయినప్పటికీ వీరిద్దరి మధ్య అక్రమ సంబంధం కొనసాగింది. దాంతో కునా మద్యానికి బానిసై దేవేంద్ర మీద కక్ష పెంచుకున్నాడు. మద్యం మత్తులో సిమిలిగుడ తహసీల్దార్ కార్యాలయం వద్ద కునా కాపు కాశాడు. అదే సమయంలో దేవేంద్ర తన స్నేహితులతో కలిసి వెళ్తున్నాడు. వెంటనే కున తాను తెచ్చిన కత్తితో దేవేంద్రపై దాడి చేశాడు. స్థానికులు దేవేంద్రని ఆస్పత్రిలో చేర్పించినా దేవేంద్ర మృతి చెందాడు. కున సిమిలిగుడ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగిపోయాడు.

మిస్ పాపులర్‌గా తెలుగమ్మాయికి అవార్డు



సుప్రియకి మిస్ పాపులర్ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

కొరాపుట్: మిస్ ఒడిశా ఇండియా–2025 పోటీల్లో మిస్ పాపులర్‌గా తెలుగమ్మాయికి ప్రథమ స్థానం వచ్చింది. సోమవారం భువనేశ్వర్ లైఫ్ ప్రైవేట్ హోటల్ మిస్ ఒడిశా ఇండియా 2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అందాల అమ్మాయిలు పాల్గొన్నారు. ఇందులో కోరాడ సుప్రియకు మిస్ పాపులర్ విభాగంలో ప్రథమ స్థానం వచ్చింది. సుప్రియ స్వస్థలం కొరాపుట్ జిల్లా జయపూర్ సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి కేంద్రం. సుప్రియ తండ్రి కోరాడ సురేష్‌ది బొరిగుమ్మ. ఇక్కడే వ్యాపారం చేసేవారు. వ్యాపారరీత్యా భువనేశ్వర్‌లో స్థిరపడ్డారు. సుప్రియ ప్రస్తుతం పీజీ చదువుతోంది.

శాన్ ఫ్రాన్సిస్కోలో ..
సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రదర్శన



శాన్ ఫ్రాన్సిస్కో డీఏసీకి ప్రాతినిధ్యం వహించిన సీయూటీఎం ప్రతినిధులు

భువనేశ్వర్: సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ–మేనేజ్‌మెంట్ (సీయూటీఎం) అరుదైన ఘనత సాధించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రారంభమైన 62వ డిజైన్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్ (డీఏసీ)లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా తన సామర్థ్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఈ కాన్ఫరెన్స్ ఈ నెల 22న ప్రారంభమైంది, 25 వరకు కొనసాగనుంది. సెమీకండక్టర్, డిజైన్ ఆటోమేషన్ పరిశ్రమ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సెంచూరియన్ ప్రాతినిధ్యం వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'చిప్స్ టు సిస్టమ్స్' అనే శీర్షికతో నిర్వహిస్తున్న డీఏసీ కార్యక్రమానికి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ), సెమీకండక్టర్ టెక్నాలజీలు, సిస్టమ్ ఇన్నోవేషన్ రంగంలో దిగ్గజాలు హాజరు కావడం విశేషం. వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎస్ రావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ దాస్, లక్ష్మీకాంత్ సుతార్‌లతో కూడిన బృందం సెంచూరియన్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డీఎస్ రావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వేదికపై సామర్థ్యాన్ని ప్రదర్శించిన తొలి వర్సిటీగా సెంచూరియన్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. వర్సిటీలో సెమీకండక్టర్ టెక్నాలజీ పాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మార్ఫ్యూ సెమీ కండక్టర్స్‌తో ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. విద్యతో పాటు సాంకేతిక ఆవిష్కరణల్లోనూ వర్సిటీ గుర్తింపు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అధునాతన పారిశ్రామిక రంగానికి అక్కరకు వచ్చే రీతిలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రపంచ స్థాయిలో సెంచూరియన్ తన ఉనికి చాటుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జగన్నాథునికి అమృత అన్న భోగం



అమృత అన్న భోగం బియ్యం సరఫరాదారులతో మందిరం సీఏఓ

● గుండిచా మందిరం నుంచి ఆరంభం

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దైనందిన భోగాల నివేదనలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది రథ యాత్ర మొదలుకొని స్వామి వారికి అమృత అన్న భోగం నివేదన ప్రారంభించనున్నారు. ఈ కార్యాచరణలో భాగంగా రథ యాత్ర నుంచి గుండిచా మందిరం అడపా మండపంలో కొఠా భోగ సమయంలో మహా ప్రభువుకు అమృత అన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. సోమవారం మందిరం ప్రధాన నిర్వాహకుడు (సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాఢీ అధ్యక్షతన జరిగిన అధికారిక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బొడు సువార్, సువార్ మహాసువార్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. సువార్ మహాసువార్ భోగ మండపంలో అమృత అన్నం ఉపయోగించాలని ప్రతిపాదించారు. మహా ప్రభువు భోగం తయారీలో అమత అన్నాన్ని ఉపయోగించడం గురించి గతంలో చర్చించి ప్రయోగాత్మకంగా ఈ చర్యని అమలు చేశారు. కొరాపుట్ ప్రగతి ఇనిస్టిట్యూట్ అమృత అన్నం బియ్యం సరఫరాకు మద్దతు ప్రకటించిందని సీఏఓ తెలిపారు. ఈ సంస్థ ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

సేంద్రియ బియ్యంతో ప్రసాదం తయారీ..

మందిరంలో జగన్నాథుని అన్న ప్రసాదాలు మహాప్రసాదంగా ప్రతీతి. ఈ ప్రసాదం సేంద్రియ బియ్యాన్ని ఉపయోగించి తయారు చేయాలని పాలక వర్గం నిర్ణయించడం ప్రత్యేకత సంతరించుకుంది. స్వామి నిత్య అన్న ప్రసాదాల తయారీలో సేంద్రియ బియ్యం వినియోగిస్తారు. ఈ బియ్యంతో వండిన ప్రసాదాల్ని అమృత్ అన్నం అనే ప్రత్యేక పేరుతో వ్యవహరిస్తారు. ఎటువంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా సహజమైన ఎరువులను ఉపయోగించి సాగు చేసిన బియ్యం మాత్రమే వినియోగిస్తారు. తొలి దశలో స్వామికి నివేదించే కొఠా భోగ సేవలో మాత్రమే వినియోగిస్తారు. తదుపరి దశలో ఇతర అన్ని వంటకాల్లో ఈ బియ్యం వినియోగం బలపరుస్తారు. రాష్ట్రంలో రైతులు పండిస్తున్న కొళాజీర, పింపుడిబాసా, యువరాజ్ మొదలైన సేంద్రియ బియ్యాన్ని అమృత అన్న మహా ప్రసాదంలో ఉపయోగిస్తారు. మందిరంలో రోజుకు 50 నుండి 55 క్వింటాళ్ల బియ్యంతో స్వామి మహా ప్రసాదం వంటకం అవుతుంది. ప్రత్యేక ఉత్సవాలు, పండగపబ్బాల సందర్భంగా రోజుకు 100 నుండి 200 క్వింటాళ్ల బియ్యాన్ని ఉపయోగిస్తారు. అదనంగా కొఠా భోగం కోసం ప్రతి రోజూ 100 కిలోల బియ్యాన్ని ఉపయోగిస్తారు. అన్న మహా ప్రసాదానికి అధిక నాణ్యత గల బియ్యం వినియోగానికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. పిండి వంటల ప్రసాదాల తయారీలో మసూరి బియ్యం కొనసాగుతుంది. క్రమంగా వీటి స్థానంలో అమృత్ అన్నం బియ్యం వినియోగించే యోచన ఉన్నట్లు పేర్కొన్నారు. పథకం ప్రకారం మందిరం అన్న ప్రసాదాల తయారీలో కొరత లేకుండా అమృత అన్నం బియ్యం సరఫరా చేసేందుకు కనీసం నాలుగు వందల నుంచి ఐదు వందల ఎకరాల భూమిలో సేంద్రియ వరి సాగు అవసరం అని అనుభవజ్ఞుల వర్గం పేర్కొంది. మందిరం పాలక వర్గం ఈ మేరకు సన్నాహాలు చురుగ్గా కొనసాగిస్తుంది.

కుమార్తె మృతిపై తల్లిదండ్రుల ఫిర్యాదు

రాయగడ: కొలనార సమితిలోని పెంట పంచాయతీ పరిధి టంపరగుడ గ్రామానికి చెందిన యువకుడు పయిడి సచిన్ (19) అదే గ్రామానికి చెందిన యువతితో ప్రేమలో పడ్డాడు. ఆరు నెలల క్రితం సచిన్ తను ప్రేమించిన యువతిని కేరళ తీసుకొని వెళ్లిపోయి అక్కడ పెళ్లి చేసుకుని స్థిరపడ్డాడు. వారం రోజుల క్రితం యువతి ఆరోగ్య క్షీణించడంతొ చికిత్స కోసం యర్నాకులంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ క్షీణించడంతో యువతి శుక్రవారం మృతి చెందింది. ఈ సమాచారాన్ని సచిన్ యువతి తల్లి దండ్రులకు తెలియజేశాడు. దీంతో యువతి తల్లి దండ్రులు కేరళ వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసకువచ్చారు. తన కూతురు అనారోగ్యంతో చనిపోలేదని, సచిన్ హత్య చేశాడని ఆరోపిస్తూ చందిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సచిన్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విక్రమదేవ్ వర్మ జయంతికి ఏర్పాట్లు



మోడరన్ పాఠశాలలో జయంతి సన్నాహక సమావేశం

జయపురం: సాహితీ సామ్రాట్, జయపురం మహారాజు విక్రమదేవ్ వర్మ జయంతి ఉత్సవాలు ఈ నెల 28న అంగరంగ వైభవంగా జరపాలని నిర్ణయించారు. ఒడిశా సాహిత్య అకాడమీ, జయపురం సాహిత్య పరిషత్‌లు సంయుక్తంగా విక్రమదేవ్ వర్మ జయంతి జరుపనున్నాయి. సోమవారం జయపురం సమితి అంబాగుడ కాళీమందిరంలో విక్రమ దేవ్ జయంతి శుభారంభం పూజలు చేశారు. అనంతరం విక్రమదేవ్ జయంతి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జయపురం మోడరన్ ఇంగ్లిష్ మీడియమ్ స్కూలు, అరవింద నగర్ సరస్వతీ విద్యా మందిర్, మున్సిపాలిటీ విద్యాలయాల్లో జయంతి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మోడరన్ స్కూలు ప్రాంగణంలో జయపురం సాహిత్య పరిషత్ అధ్యక్షులు హరిహర కరసుధా పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జయంతి ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. అవిభక్త కొరాపుట్ స్థాయిలో 15 దినాలు ఉత్సవాలు జరపాలని తీర్మానించారు. విక్రమదేవ్ చరిత్ర విద్యార్థులందరికీ తెలిసేటట్టు ప్రతి పాఠశాలలో విక్రమదేవ్ వర్మపై చర్చా వేదికలు నిర్వహించాలని నిర్ణయించారు.

పాలకుల ఆలస్యం.. గిరిజనుల లౌక్యం

కొరాపుట్: దశాబ్దాలు గడుస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో గిరిజనులు లౌక్యంతో తాత్కాలిక కర్ర వంతెన నిర్మించుకున్నారు. కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి బద్దిగుడ గ్రామ పంచాయతీ డొక్రిపాడ–ఉద్ది పాడ గ్రామాల మధ్య ఈ నిర్మాణం జరిగింది. వర్షాకాలం వస్తే డొక్రిపాడ నది ఉప్పొంగుతుంది. దాంతో ఈ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. కొరాపుట్ జిల్లాలో చివర డొక్రిపాడ నదికి అవతల ఉద్దిపాడ గ్రామం ఉంది. ఆ గ్రామానికి ఆనుకొని మల్కన్‌గిరి జిల్లా ప్రారంభం అవుతుంది. గిరిజనులు రేషన్ బియ్యం, పంచాయతీ కార్యాలయ పనులు, విద్య కోసం నది దాటాలి. వర్షాకాలం వస్తే ప్రాణాలు పణంగా పెట్టి వెళ్లాలి. ఇక్కడ వంతెన నిర్మించాలని ఇరు వైపులా 20 గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నా ఫలితం లేక పోయింది. దాంతో గ్రామస్తులే విరాళాలు వేసుకొని నది మధ్యలో సిమ్మెంట్ స్తంభం నిర్మించారు.



రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

అనంతరం దాని మీద కర్రలు వేసి తాత్కాలిక వంతెన నిర్మించారు. ఇది పాదచారులకు అనుకూలంగా మారింది. సోమవారం నుంచి ఈ వంతెన గిరిజనుల రాకపోకలకు అందుబాటులోకి వచ్చింది. ఈ విషయంపై కొరాపుట్ జిల్లా ఆర్‌డీ విభాగం అధికారులు స్పందిస్తూ అక్కడ వంతెన నిర్మాణం నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు వేస్తామని హామీ ఇచ్చారు.



ఒడ్డుకు ఒక వైపు కర్రలు జారి పోకుండా ఉండడానికి రాళ్లు పెడుతున్న దృశ్యం



నిర్మితమైన తాత్కాలిక కర్ర వంతెన



అడవిలో కర్రలు సేకరిస్తున్న గిరిజనులు

క్లుప్తంగా

కూలిన భారీ చెట్టు



చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక బృందం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి మూడురోడ్ల కూడలి వద్ద ఉన్న భారీ చింత చెట్టు సోమవారం తెల్లవారి జామున ఇదురుగాలులకు పడిపోయింది. చెట్టు విద్యుత్ స్తంభంపై పడింది. సమీపంలో ఉన్న ఓ ఇంటి గోడను తాకింది. ఇంటిలో నివసిస్తున్న వారు అంతా బయటకు వచ్చేశారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. వెంటనే విద్యుత్ కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్‌ను నిలిపివేశారు. అగ్నిమాపక బృందానికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ స్టేషన్ అధికారి సునీల్ నాయక్ పర్యవేక్షణలో చెట్టును తొలగించారు సుమారు ఐదు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి.

చెరువులో మునిగి మహిళ మృతి



మహిళ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎం.వి 79 పోలీసుస్టేషన్ పరిధిలో తాండబాయిలో సోమవారం గ్రామానికి చెందిన శింగే సొంధి (31) దుస్తులు ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్లింది. వర్షం వల్ల బురదగా ఉండటంతో కాలు జారి చెరువులో పడిపోయింది. ఆమె ఇంటికి ఎప్పటికీ రాకపోవడంతో భర్త గ్రామంలో ఆరా తీశాడు. ఆమె చెరువు వద్దకు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. చెరువు వద్దకు వెళ్లి చూస్తే ఆమె చీర నీటిలో తేలుతూ కనిపించింది. వెంటనే గ్రామ సర్పంచ్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమెను బయటకు తీశారు. అప్పటికే మృతిచెందింది. పోలీస్ స్టేషన్ ఐఐసీ కృష్ణచంద్ర తండి సంఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

విజిలెన్స్ వలలో సీడీపీఓ, క్లర్కులు



సీడీపీఓ సుశీల సాబొరొ (ఫైల్)



క్లర్క్ రామచంద్ర పాత్రో (ఫైల్)

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ లో గల ఐసీడీఎస్ కార్యాలయంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి (సిడిపిఒ) సుశీల సబర్, క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న రామచంద్ర పాత్రోలు సోమవారం విజిలెన్స్ వలలో చిక్కుకున్నారు. సమితిలోని చాటికొన పంచాయతీలోని హుతేషి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న సీత వడక నుంచి రూ.80 వేలు లంచంగా తీసుకుంటూ ఉండగా విజిలెన్స్ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల నియమకానికి సంబంధించి హుతేషి గ్రామానికి చెందిన ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఒకరి నుంచి వీరిద్దరూ లంచం డిమాండ్ చేశారు. ఆమె రూ.20వేలు ఇచ్చారు. మరో రూ.80 వేల కోసం వేధించడంతో ఆమె విజిలెన్స్‌ను ఆశ్రయించింది. దీంతో విజిలెన్స్ అధికారులు వల వేసి పట్టుకున్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా కిల్లాన

శ్రీకాకుళం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం బీసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడిగా కిల్లాన శ్రీనివాస రావు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ సోమవారం నియామక ఉత్తర్వులు అందించారు. శ్రీనివాసరావు గత ఐదేళ్లుగా బీసీ సంఘంలో పనిచేస్తూ సంఘ అభివృద్ధికి, పటిష్టతకు కృషి చేశారు.

రూపుదిద్దుకుంటున్న జగన్నాథుని రథం

రాయగడ:

ఈ నెల 27 నుంచి తొమ్మిది రోజుల పాటు జరగనున్న రథాయాత్ర కోసం రథం నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రథం తయారీలో భాగంగా రంగులు అద్దే పనుల్లో కళాకారులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది సుమారు 15 లక్షల రుపాయలను వెచ్చించి రథాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నహాలు చేస్తుంది. స్థానిక పాతబస్టాండు సమీపంలోని గుండిచా మందిరంలో పరిశుభ్రత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజుల పాటుగా జగన్నాథ, బలభద్ర, శుభద్ర దేవతా మూర్తులు గుండిచా మందిరంలో ఉండి భక్తులకు దర్శంన ఇస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి తెలిపారు. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తొమ్మిది రోజుల యాత్రలో భాగంగా గుండిచా మందిరానికి ఆనుకుని ఏర్పాటైన స్టాల్స్ వద్ద భక్తుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో పోలీసులు బందోబస్తు పూర్తిగా ఉంటుందని వివరించారు.



నిర్మాణ దశలో రథం

శ్రీ జగన్నాథునికి ఖొల్లి లగ్గి సేవ

భువనేశ్వర్: జగన్నాథుడిని యాత్రకు సిద్ధం చేసేందుకు గోప్య సేవకుల వర్గం తలమునకలై ఉంది. గత 13 రోజులుగా స్వామి సోదరీ సోదరులతో కలిసి తెర చాటున గోప్య సేవలు పొందుతున్నాడు. ఆషాఢ కృష్ణ పక్ష త్రయోదశి తిథి పురస్కరించుకుని స్వామి వారికి ఖొల్లి లగ్గి సేవ నిర్వహించారు. రాత్రి పూట ఈ సేవని చేపట్టారు. జ్వరం నుంచి ఉపశమనం పొందడంతో శారీరక దారుఢ్యం కోసం పలు లేపన సామగ్రి గోప్య మండపానికి తరలించడం ఖొల్లి లగ్గి సేవలో భాగం.

శుద్ధ సువార్ సేవకుల ఇంటి నుంచి ఈ సామగ్రిని తీసుకుని వెళ్లడం ఆచారం. ముందు రోజు ద్వాదశి నాడు చీకటి పడిన తర్వాత శ్రీ మందిర సముదాయం విమలా దేవి పీఠం ఆవరణలో ఉన్న బావి నుంచి నీరు తోడుకుని పోయి స్వామి చికిత్స కోసం అవసరమైన లేపనాలు తయారు చేశారు. బాజా, తురాయి, ఘంటానాదంతో శుద్ధ సువార్ ఇంటి నుంచి శ్రీ మందిరానికి ఊరేగింపుగా ఔషధ సామగ్రిని సోమవారం తరలించారు. ఈ లేపన సామగ్రిని బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథుని శ్రీ అంగాలకు పూర్తిగా అద్దుతారు. దీనితో శరీరం వజ్ర దారుఢ్యంతో మెరుస్తుంది.



శ్రీ మందిరానికి తరలి వెళ్తున్న లేపన వైద్య సామగ్రి

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: బహుముఖ ప్రతిభాశాలి, అసాధారణ వ్యక్తి డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను స్థానిక రాజవీధిలోని విశ్వనాథ్ మండపంలో బీజేపీ శ్రేణులు సోమవారం జరుపుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నవకిశోర్ శోబోరో ముఖర్జీ చిత్రపటానికి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ కేవలం 33 ఏళ్లకే కోల్‌కోతా వర్సిటీలో ఉపకులపతిగా పనిచేశారన్నారు. అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ క్యాబినెట్‌లో పనిచేసిన ముఖర్జీ జమ్ము, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 వ్యతిరేకించారని అన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఛిత్రి సింహాద్రి, కాశీనగర్ నాయకులు రొక్కం రాంప్రసాద్, ఎంపీప్రతినిధి దారపు రాజేష్ కుమార్, రొక్కం సతీష్, ఎస్.శేషగిరిరావు (గుమ్మ) పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు 22 వినతులు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి కిడిగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జాయింట్ గ్రీవెన్ సెల్‌కు అధిక స్పందన లభించింది. గ్రీవెన్స్‌కు జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వాహణాధికారి శంకర కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ పాల్గొన్నారు. కాశీనగర్ సమితిలో గోరిబంద, హడ్డుబంగి, శియ్యాళి, కిడిగాం గ్రామాల నుంచి 22 వినతులు అందాయి. వాటిలో తొమ్మిది వ్యక్తిగతం, 13 గ్రామసమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కాశీనగర్ బి.డి.ఓ.డంబుధర మల్లిక్‌కు ఆదేశించారు. గ్రీవెన్సుకు కాశీనగర్ తాహసీల్దార్, సీడీఎంవో డాక్టర్ ఎం.ఎం.ఆలీ, డీఎస్.యస్.ఓ. సంతోష్ కుమార్ నాయక్ ఉన్నారు.

సారాపై ఉక్కు పాదం మోపండి

- సీఎంకు లక్ష్మీపూర్ ఎమ్మెల్యే వినతి



సీఎం మోహన్ మజ్జికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత



ఎక్సైజ్ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: సారా తయారీపై ఉక్కు పాదం మోపాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజధాని భువనేశ్వర్‌లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఎంతో సమావేశమైన స్థానిక పరిస్థితులు వివరించారు. నాణ్యతలేని పదార్థాలతో సారా తయారు చేసి వ్యాపారులు విక్రయిస్తున్నారన్నారు. దీనివలన వేలాది మంది గిరిజనులు అనారోగ్యంతో మరణిస్తున్నారన్నారు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుందన్నారు. గిరిజన మహిళల ఫిర్యాదులతో తానే స్వయంగా మద్యం తయారీ కేంద్రాలను పరిశీలించానన్నారు. పురుగులు పట్టిన పదార్థాలతో సారా తయారు చేస్తున్నారన్నారు. తనతో కలిసి వేలాది మంది గిరిజనులు మద్యంపై పోరాటాలు చేశారన్నారు. సుమారు 400 మందికి పైగా గిరిజనులపై అక్రమ కేసులు పెట్టారని ఆధారాలు చూపించారు. ఇటువంటి ప్రజా పోరాటాలు చేసే వారిపై కేసులు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, ముఖ్యమంత్రి సలహాదారుడు ప్రకాష్ మిశ్రలతో భేటీ అయి పరిస్థితిని వివరించారు.

డెంగీ నివారణకు చర్యలు

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని రథ యాత్ర దగ్గర పడుతుంది. వర్ధమాన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అనుబంధ యంత్రాంగాలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. పూరీ పట్టణ వ్యాప్తంగా డెంగీ నివారణకు ముందస్తు చర్యల్ని చురుకుగా చేపడుతున్నారు. ఈ కార్యాచరణలో భాగంగా పట్టణంలో మారుమూల ప్రదేశాలలో ప్రత్యేక డ్రోన్‌ల ద్వారా దోమల బెడద నివారణ మందు పిచికారీ చేస్తున్నారు.



దోమల మందు పిచికారీ కోసం సిద్ధం చేసిన డ్రోన్

బంగారం చోరీ

నందిగాం: మండల కేంద్రమైన నందిగాం గణేష్ కాలనీలోని ఒక ఇంట్లో బంగారం చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గణేష్ కాలనీలో నివాసముంటున్న కృష్ణవేణి లఖిదాసుపురం సచివాలయంలో ఏఎన్ఎంగా పని చేస్తుంది. ఆదివారం తన ఇంటికి తాళం వేసి హరిదాసుపురంలో ఉన్న కన్నవారింటికి వెళ్లింది. తిగిరి సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా కొన్ని వస్తువులు చిందరవందరగా ఉండడాన్ని గమనించింది. అనుమానంతో బెడ్‌రూమ్ తలుపు తీయగా అక్కడ ఉన్న కిటికీ గ్రిల్ సగం తీసి వేసి ఉంది. మరో గదిలో ఉన్న ఇనుప బీరువాను చూడగా బీరువా తలుపు వంచి ఉండటం గమనించి చూడగా, లోపల ఉండాల్సిన బంగారం కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. టెక్కలి సీఐ శ్రీనివాసరావు కృష్ణవేణి ఇంటిని పరిశీలించి, క్లూస్ టీమ్‌ను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. సుమారు 16 తులాల బంగారు ఆభరణాలు, వెండి చెంబు, గ్లాసు, పళ్లెం తదితర వస్తువులు పోయినట్లు తెలిపింది.

గోపాల్‌పూర్ అత్యాచారం సంఘటనపై తాఖీదులు జారీ

భువనేశ్వర్: గంజాం జిల్లా గోపాల్‌పూర్‌లో మహిళా కళాశాల విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం సంఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్వయంగా చొరవ తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మరియు పోలీస్ డైరెక్టర్ జనరల్‌కు సోమవారం తాఖీదుల జారీ చేసింది. 2 వారాల్లోగా ఈ అధికారులు వివరణాత్మక నివేదిక దాఖలు చేయాలని గడువు ఇచ్చింది.

వెబ్ పోర్టల్ ప్రారంభం

భువనేశ్వర్: రాష్ట్రంలో పిల్లల సంక్షేమం, పిల్లల పోషణ, పిల్లల రక్షణ రంగాల పని శైలి మెరుగుపరిచేందుకు మహిళ, శిశు అభివృద్ధి శాఖ బాధ్యతలు వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి, ప్రభాతి పరిడా శిశు వెబ్‌పోర్టల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా పిల్లల ఆరోగ్యం, పోషకాహారాన్ని కచ్చితంగా తెలుసుకునేందుకు వీలవుతుంది. ఈ వెబ్ పోర్టల్ శిశు పౌష్టికత, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098ను సమన్వయం చేస్తుంది. మిషన్ వాత్సల్య, యశోద, దీక్ష వంటి పథకాల నవీకరించిన సమాచారాన్ని ఈ పోర్టల్ ప్రజలకు తెలియజేస్తుంది.

పూరీ–గుణుపురానికి ప్రత్యేక రైళ్లు

పర్లాకిమిడి: పూరీ రథయాత్ర సందర్భంగా ఈస్టు కోస్టు రైల్వే గుణుపురం–పూరీ–గుణుపురానికి ఈనెల 26, జూలై 4, జూలై 5న ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈనెల 26న ట్రైన్ నంబర్ 08443 సాయంత్రం 6.30కు గుణుపురం నుంచి బయల్దేరి మరుసటి రోజు వేకువన 2.15కు పూరీ చేరుకుంటుంది. అన్ని స్టేషన్లలో ఈ ట్రైన్ ఆగుతుంది. అలాగే తిరుగు ప్రయాణం ట్రైన్ నెంబరు 08428 పూరీ నుంచి 2.45లకు వేకువజామున బయలుదేరి గుణుపురానికి మధ్యాహ్నం 12.30లకు చేరుకుంటుందని ఈస్టుకోస్టు రైల్వే సీనియర్ డివిజనల్ మేనేజరు కె.సందీప్ తెలియజేశారు. రిటర్న్ ట్రైను పూరీ నుంచి జూన్ 27 నుంచి జూలై 6, జూలై 7 వరకూ నడుస్తుంది. అలాగే పలాస, పూరీ, పలాసకు అన్‌రిజర్వుడ్ స్పెషల్ ట్రైన్సు కూడా జూన్ 26 నుంచి జూలై 7 వరకూ రాత్రి 9.30కు పలాసలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కు పూరీ చేరుకుంటుంది. రిటర్న్ ట్రైన్లు కూడా పూరీ నుంచి పలాసకు జూన్ 27 నుంచీ జూలై 8 వరకూ నడుస్తాయి. మధ్యాహ్నం 2.30కు బయల్దేరి అదే రోజు రాత్రి 9.15కు పలాస చేరుకుంటుంది. అన్ని స్టేషన్లలో ఈ ప్యాసింజరు ట్రైను నిలుపుదల చేస్తారని ఒక ప్రకటనలో తెలియజేశారు.

డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

కొరాపుట్: తమ డిమాండ్లు ప్రభుత్వం ఆమోదించకపోతే ఉద్యమ బాట పడతామని ఒడిశా రెవెన్యూ మినిస్ట్రియల్ ఉద్యోగులు ప్రకటించారు. సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి బాలాజీ సాహు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఈ విషయాన్ని ప్రకటించారు. జిల్లా స్థాయి రెవెన్యూ అధికారుల జీతాలు పెంచాలన్నారు. ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రూ.20 లక్షల బీమా ఏర్పాటు చేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం చేపట్టాలన్నారు. కొత్త పెన్షన్ పథకం రద్దు చేసి పాత పెన్షన్ పథకం అమలు చేయాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించకపోతే జులై 7 నుంచి 11వ తేదీ వరకు నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరవుతామన్నారు. జులై 14వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటామన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు లోకేశ్వర్ సాహు, ప్రసన్న కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు తిరుపతి బాలాజీ సాహు



ఉమ్మర్‌కోట్‌లో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

వినతుల స్వీకరణ

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో జిల్లా కలెక్టర్లు ప్రజా ఫిర్యాదులు స్వీకరించారు. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలోని సమితి కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఇందులో 48 ఫిర్యాదుల రాగా.. వాటిలో 40 వ్యక్తిగత, 8 సామాజిక ఫిర్యాదులు ఉన్నాయి. 22 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఎస్పీ సందీప్ సంపత్ పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్‌లో కలెక్టర్ వి.కీర్తి వాసన్ గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు చెక్కులు పంపిణీ చేశారు. ఎస్పీ రోహిత్ వర్మ పాల్గొన్నారు.



లక్ష్మీపూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మ

ఆదర్శప్రాయ సేవకు సత్కారం

భువనేశ్వర్: అప్రమత్తతతో విధులు నిర్వహించి అత్యుత్తమ అంకితభావం ప్రదర్శించిన ఉద్యోగులను తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ ప్రత్యేకంగా సత్కరించారు. ఈ ముగ్గురు సిబ్బంది పనితీరు ఆదర్శప్రాయమని అభినందించారు. జనరల్ మేనేజరు సత్కారం పొందిన రైల్వే ఉద్యోగుల్లో లక్ష్మీపూర్ స్టేషన్ మేనేజర్ ఉత్తమ్ కుమార్, సింహాచలం (ఉత్తర) సీనియర్ గూడ్స్ రైలు మేనేజర్ పొదిలాపు గౌరీ శంకర్, రహమాలో ట్రాక్ మెయింటెయినర్ – 3 మనోజ్ కుమార్ హంసదా ఉన్నారు.



సత్కారం పొందిన సిబ్బంది

నవీన్ త్వరగా కోలుకోవాలని పూజలు

కొరాపుట్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ త్వరగా కోలుకోవాలని కోరుతూ పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి కేంద్రంలోని మా పెండ్రాణి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి, బీజేడీ నాయకులు పాల్గొన్నారు. జయపూర్ పట్టణం భగవతి మందిరంలో బీజేడీ శ్రేణులు దీపాలు పెట్టి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బి.సునీత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



చందాహండిలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి తదితరులు

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



ఆర్అండ్‌బీ రోడ్డులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి లేదా సంక్షేమ పథకాలైనా అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ముందుగా ఆర్ అండ్ బీ బంగ్లా రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అంగన్‌వాడీలను సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసినందువలన సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపు(ఎఫ్.ఆర్.ఎస్) రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు.

వేధింపులకు పాల్పడుతున్నారు

కోటబొమ్మాళి మండలంలో అంగన్‌వాడీలపై అధికార పార్టీ నేతలు రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గత నెలలో ఇద్దరు అంగన్‌వాడీ వర్కర్లను రాజకీయ కక్షలతో తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన అంగన్‌వాడీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా పరిషత్‌లో డీఆర్‌వో ఎం.వెంకటేశ్వరరావుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె.సూరయ్య, ఎస్.వి.రమణ, ఆర్.ప్రకాశరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్.హైమవతి, పి.లతాదేవి, కె.సుజాత, జె.కాంచన, కె.లక్ష్మి, ఎస్.ఆదిలక్ష్మి, పి.రమణమ్మ, వి.హైమవతి, కె.మోహిని, జ్యోతి, టి.రాజేశ్వరి, వై.విజయలక్ష్మి పాల్గొన్నారు.

జయపూర్‌లో యువ ట్రైనీ ఓఏఎస్‌ల పర్యటన



యువ ట్రైనీ ఓఏఎస్ అధికారులతో ఎమ్మెల్యే బాహినీపతి, సబ్ కలెక్టర్ సస్య రెడ్డి



పింఛన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

కొరాపుట్: యువ ట్రైనీ ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారులు జయపూర్ పట్టణంలో క్షేత్ర పర్యటన చేశారు. సోమవారం మెయిన్ రోడ్డులో బంకు మఠం సమీపంలో గల బాబా సాహెబ్ కల్యాణ మండపంలో జరిగిన పీఎంఏవై, మధుబాబు పింఛన్ యోజన పథకాల లబ్ధిదారులకు వర్క్ ఆర్డర్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి సమావేశమయ్యారు. ఈ పర్యటనలో 20 మంది ట్రైనీ యువ అధికారులు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ ఆకవరం సస్య రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. మరోవైపు ఈ కార్యక్రమాన్ని ప్రతిపక్ష బీజేడీ సభ్యులు బహిష్కరించారు. మొత్తం 28 మంది వార్డులు ఉన్న మున్సిపాలిటీలో 15 మంది బీజేడీ కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ బి.సునీత హాజరుకాలేదు. పెన్షన్ విభాగంలో పని చేస్తున ఒక ఉద్యోగి కౌన్సిలర్లపై నిర్లక్ష్యం వహిస్తున్నారని వివాదం జరుగుతుంది. సదరు ఉద్యోగి పట్ల చర్యలు తీసుకోవాలని బీజేడీ కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదం పరిష్కారం కాకుండా పెన్షన్‌లు పంపిణీ చేయడం పట్ల ఆగ్రహంతో బీజేడీ కౌన్సిలర్లు బహిష్కరించారు.

క్లుప్తంగా

మిగులు సీట్లకు రాతపరీక్ష రేపు

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్లకు ఈ నెల 25న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా గురుకుల సమన్వయకర్త ఎస్.రూపావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7 తరగతులకు సంబంధించి బాలురకు కొప్పెర్ల గురుకులంలో.. బాలికలకు నెల్లిమర్ల గురుకులంలో ఉదయం 10 గంటల నుంచి 11 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా 8, 9 తరగతులకు సంబంధించి బాలురకు కొప్పెర్లలో.. బాలికలకు నెల్లిమర్లలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 89858 83015, 63038 38657 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఐదో తరగతిలో ఉన్న ఖాళీలను ఎటువంటి ప్రవేశ పరీక్ష నిర్వహించకుండా కేటాయిస్తామని.. ఆసక్తి ఉన్న విద్యార్థులు జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ జంక్షన్‌లో ఉన్న సమన్వయకర్త అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

లారీ బోల్తా

జామి: మండలంలోని అలమండ సమీపంలో ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. విశాఖపట్నం నుంచి రాయపూర్ వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రుడ్ని అలమండ పీహెచ్‌సీకి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా - డ్రైవర్ మృతి



ప్రమాద స్థలంలో సుబ్బారావు మృతదేహం

పార్వతీపురం రూరల్: మండలంలోని జిల్లేడువలస సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మృతుడిని మక్కువ మండలం ఎర్రసామంతవలస గ్రామానికి చెందిన మండంగి సుబ్బారావు(35) గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సంఘటనా స్థలంలో మృతి చెందిన రామకృష్ణ

తెర్లాం: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని డి.గదబవలస గ్రామం వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. దీనికి సంబంధించి ఎస్సై సాగర్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గంగన్నపాడు గ్రామానికి చెందిన పోరపు రామకృష్ణ (18) తెర్లాం నుంచి పెరుమాళి వైపు కొత్తగా వేసిన విద్యుత్ లైన్‌లో కూలి పనికోసం వెళ్తున్నాడు. సోమవారం కూడా విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా.. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా రావడంతో స్తంభం పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు, చెల్లి ఉన్నారు. మృతిడి తండ్రి సోదన్నదొర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో ఉన్న ఉమా సదాశివాలయంలో సోమవారం మాస శివరాత్రి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో తొలుత గణపతి పూజ చేసి, భక్తులతో ప్రత్యేక హోమాలు చేయించారు. అనంతరం పంచామృతాలతో ఉమా సదాశివుడికి అభిషేకం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శక్తి సదన్ సందర్శన

విజయనగరం ఫోర్ట్: నగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీలో ఉన్న మహిళా ప్రాంగణంలోని శక్తి సదన్ భవనాన్ని ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి సోమవారం సందర్శించారు. అక్కడి మహిళలతో మాట్లాడి, ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని అడిగారు. కార్యక్రమంలో ప్రాంగణం మేనేజర్ బి.రెబెకా, సూపరింటెండెంట్ కమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు.. శాశ్వత పరిష్కారం చూపండి..

- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి
- పీజీఆర్ఎస్‌కు 166 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్:

ప్రజా వినతుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే వినతులకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు లాగిన్‌లో ఎప్పటికప్పుడు సమస్యలను చూసుకుంటూ రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ లాగిన్ అయ్యి వినతులను శతశాతం పరిష్కరించాలని ఆదేశించారు.

166 వినతుల స్వీకరణ..

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 166 వినతులు వచ్చాయి. డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు, విజయనగరం ఆర్‌డీఓ సవరమ్మ, పౌరసరఫరాల డీఎం బి.శాంతి, డీఈఓ యూ.మాణిక్యంనాయుడు హాజరై వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు అత్యధికంగా 69 వినతులు.. పంచాయతీ శాఖకు 17.. పింఛన్లు మంజూరు చేయాలని, తదితర అంశాలపై డీఆర్‌డీఏకు 22 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 5, విద్యాశాఖకు 15, హౌసింగ్‌కు 2 అందగా వైద్యశాఖకు 4, విద్యుత్ శాఖకు 4 వినతులు రాగా.. మిగిలినవి ఇతర శాఖలకు చెందిన సమస్యలు.

చట్ట పరిధిలో పరిష్కరించాలి

- ఏఎస్పీ సౌమ్యలత



సమస్యలు వింటున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: అర్జీదారులు తెలియజేసిన సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఏఎస్పీ పి. సౌమ్యలత అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 43 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలు తెలుసుకున్నామన్నారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మొత్తం 43 వినతులు రాగా భూ తగాదాలకు సంబంధించినవి 15.. కుటుంబ కలహాలకు సంబంధించినవి 4.. మోసాలకు సంబంధించినవి 7.. ఇతర అంశాలకు సంబంధించినవి 17 ఉన్నాయన్నారు. ఏడు రోజుల్లో సమస్యలపై స్పందించి, వాటిపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, డీసీఆర్‌డీ సీఐ బి.సుధాకర్, ఎస్సై ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

• పీజీఆర్ఎస్‌కు 203 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను పారదర్శకంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత అన్నారు. స్థానిక కలెక్టరేట్ పీజీఆర్ఎస్ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు సుధారాణితో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 203 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఫిర్యాదునూ మానవతాకోణంలో ఆలోచించి శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా వినతులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాకారి కె.రాబర్ట్‌పాల్, డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖధికారి బి.రాజ్‌కుమార్, పార్వతీపురం కో-ఆపరేటివ్ అధికారి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- వీరఘట్టం మండలం యు.వెంకంపేటలో ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, వర్షాకాలంలో శ్లాబ్ నుంచి నీరు లీకవడంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, అదనపు భవనం మంజూరు చేయాలని గ్రామానికి చెందిన ఎస్. సింహాచలం వినతి అందజేశారు.
- గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమటి గ్రామంలో ప్రాథమిక పాఠశాల మూసి వేయడం వల్ల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాలను పునఃప్రారంభించాలని తాడంగి దమయంతమ్మ, తదితరులు వినతి సమర్పించారు.
- సర్వే నంబర్ 85-2లో ఉన్న భూమికి విద్యుత్ కనెక్షన్ పొందడానికి అవసరమైన రుసుం, సరిఫికెట్లను విద్యుత్ శాఖకు సమర్పించానని.. అయితే కొంతమంది కావాలనే పనిని అడ్డుకుంటున్నారని పార్వతీపురం మండలం డొంకలకోటపట్నం గ్రామానికి చెందిన డి.లక్ష్మి వినతి సమర్పించారు.
- గరుగుబిల్లి మండలం హిక్కింవలస గ్రామ పాఠశాలలో 3,4,5వ తరగతులు చదువుతున్న విద్యార్థులను గరుగుబిల్లి హైస్కూల్‌లో విలీనం చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చి విద్యార్థులు స్థానికంగా చదువుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

'జిందాల్'కు నీరిస్తే రైతులకు నష్టం

- బుచ్చి అప్పారావు జలాశయం ఆయకట్టు పరిరక్షణ కమిటీ సభ్యులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తాటిపూడి ఆయకట్టు పరిరక్షణ కమిటీ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: జిందాల్ పరిశ్రమలకు బుచ్చి అప్పారావు జలాశయం (తాటిపూడి) నుంచి నీరు ఇస్తే రైతులు నష్ట పోతారని ఆయకట్టు పరిరక్షణ కమిటి సభ్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిందాల్ భూముల్లో పెట్టనున్న చిన్న పరిశ్రమల పార్కుకు బుచ్చి అప్పారావు జలాశయం నుంచి నీరు ఇచ్చేందుకు విడుదల చేసిన జీఓ 14ను రద్దు చేయాలన్నారు. జలాశయం కింద ఉన్న శివారు కాలువలకు సిమెంట్ లైనింగ్, తూములు, షట్టర్ల ఏర్పాటుతో పాటు రాకపోకలకు వీలుగా వంతెనలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రాజెక్ట్ మెయింటెనెన్స్‌కు ఇచ్చే సాధారణ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ధర్నాలో జామి మండల జెడ్పీటీసీ మాజీ సభ్యులు గొర్లె రవికుమార్, బండారు పెదబాబు, ఏపీ రైతు సంఘం కార్యదర్శి బి. రాంబాబు, గులిపల్లి జయపాల్, కొత్తలి ఎర్నాయుడు, కోడెల ముత్యాలనాయుడు, కోడెల శ్రీను, బండారు సూర్యారావు, జాగారపు అప్పారావు, కిలపర్తి శ్రీరామ్మూర్తి, గనివాడ సన్యాసినాయుడు, తమటపు పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు సంస్థ అడ్మిషన్ ఇన్‌చార్జ్ కె. శివరామకృష్ణ, జిల్లా పర్యాటక అధికారి ఎన్. నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు తిరుపతి కేంద్రంగా భారత పర్యాటకశాఖ, రాష్ట్ర పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల బీఎస్సీ (హెచ్‌హెచ్ఏ) డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40 శాతం పైన మార్కులు పొందిన వారు అర్హులన్నారు. ఫుడ్ అండ్ బెవరేజ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ అండ్ హౌస్ కీపింగ్ విభాగాల్లో నాలుగు నెలల పాటు ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటీసరి (సీసీఎఫ్‌పీపీ) కోర్స్‌కు పదో తరగతి పాసైన వారుఅర్హులన్నారు. 12 నెలల పాటు దేశ, విదేశాల వంటకాలు నేర్పించి ఫైవ్‌స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ - బెవరేజ్ సర్వీస్ (సీసీఎఫ్‌బీఎస్) కోర్సుకు కూడా పదో తరగతి పాసైన వారుఅర్హులని తెలిపారు. బాల, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 97013 43846, 91005 58006, 97004 40604 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జూలై నాలుగో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు

రోడ్డు ప్రమాదంలో హెచ్‌సీకి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో బుల్లెట్



ప్రమాదానికి కారణమైన కారు



తీవ్రంగా గాయపడిన హెడ్ కానిస్టేబుల్ కోరాడ రామునాయుడు (ఫైల్)

డెంకాడ: విజయనగరం – విశాఖ జాతీయ రహదారిపై మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ మెయిన్ గేట్ వద్ద సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్, ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై ఎ.సన్యాసినాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్‌సీ రామునాయుడు బెటాలియన్ మెయిన్ గేట్‌కు ఎదురుగా ఉన్న అయినాడ పంచాయతీలోని సత్యనారాయణపురం గ్రామంలో ఉంటున్నారు. సోమవారం 5.30 గంటల ప్రాంతంలో విధులు నిర్వహించేందుకు బెటాలియన్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. విజయనగరం నుంచి విశాఖ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామునాయుడు తలకు, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే సమీపంలో ఉన్న పోలీసులు వచ్చి రామునాయుడును విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ వాహనంతో పరారయ్యాడు. కొద్ది సేపటి తర్వాత కారును గుర్తించినట్లు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామానికి చెందిన శ్యామల (22) ఈ నెల 15వ తేదీన గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి ఆమెను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శ్యామలకు నాలుగున్నర సంవత్సరాల కిందట పెందుర్తి మండలానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. ఏడాది వయసున్న బాబు ఉన్నాడు. ఇదిలా ఉంటే ఈ నెల మొదటి వారంలో శ్యామల ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. దీంతో తన భర్త పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజుల తర్వాత శ్యామల తన తల్లి లక్ష్మి వద్దకు చేరుకోగా.. భర్త, అత్తమామలకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోవడం సరికాదని తల్లి మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్యామల గడ్డి మందు తాగేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రికి తరలిస్తుండగా..

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ గ్రామానికి చెందిన రాకోటి అప్పలస్వామి(72) ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ ఆదివారం రాత్రి తన స్వగృహంలో గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్పందించి పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. దీంతో అప్పలస్వామిని సోమవారం శ్రీకాకుళం తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.ప్రయోగమూర్తి తెలిపారు.

పది మందిపై అట్రాసిటీ కేసు నమోదు

కొత్తవలస: మండలంలోని అడ్డూరువానిపాలెం గ్రామానికి చెందిన అడ్డూరి అర్జునతో పాటు మరో 10 మందిపై దెందేరు గ్రామానికి చెందిన మొయ్య పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ షణ్ముఖరావు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అడ్డూరివానిపాలెం గ్రామ సమీపంలో గల రాయల్‌మింజ్ లేఅవుట్‌లో తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన సేనాపతి కొండలరావుకు చెందిన స్థలంలో పెంటయ్య కొద్ది కాలంగా వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈ మేరకు అర్జునతో పాటు మరో 10 మంది సంబంధిత స్థలం వద్దకు వెళ్లి పెంటయ్యను కులంపేరుతో దూషించారు. దీంతో బాధిత వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఆరుగురు వ్యక్తులపై దాడి కేసు..

వంగర: మండల పరిధి అరసాడ గ్రామంలో ఈ నెల 22న జరిగిన ఓ ఫంక్షన్ వద్ద విజయనగరం జిల్లా బలిజిపేట మండలం నారంనాయుడువలస గ్రామానికి చెందిన రాగోలు మధును గాయపరిచిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. విశాఖపటనం ఆరిలోవలో తాత్కాలికంగా ఉంటున్న రాగోలు మధు అరసాడలో జరిగిన ఫంక్షన్‌కు వచ్చారు. అదే ఫంక్షన్‌కు హాజరైన మరో ఆరుగురు వ్యక్తులు తనపై దాడి చేశారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తలకు తీవ్రగాయాలు కావడంతో రాజాం సీహెచ్‌సీకి తరలించారు. నిందితులు రాగోలు మధుసూదనరావు బొత్స వేణు, వందాన గణేష్‌తో పాటు మరో ముగ్గురుపై కేసు నమోదు చేశారు. క్షతగాత్రుడిపై కూడా ఫిర్యాదు రావడంతో పరస్పరం కేసులు నమోదైనట్లు ఎస్సై తెలిపారు.

నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలి

దత్తిరాజేరు: గ్రామాల్లో నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ విజయ భాస్కర్ వీఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వీఆర్‌ఓలు అంతా రోజూ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. నీటి తీరువా వసూళ్లకు సంబంధించిన డిమాండ్ నోటీసులు రైతులకు అందించి, డబ్బులను సచివాలయాల్లో చెల్లించే విధంగా చూడాలని సూచించారు. ఈనెలాఖరుకు 90 శాతం వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శులకు బదిలీ

దత్తిరాజేరు: మండలంలో అయిదుగురు పంచాయతీ కార్యదర్శులకు బదిలీ అయ్యిందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వంగర గ్రామ పంచాయతీ కార్యదర్శి అప్పారావు గజపతినగరం మండలం పాతబగ్గాం, గడసాం కార్యదర్శి శ్రీనివాసరావు తెర్లాం మండలం,తాడేందొరవలస కార్యదర్శి భాషా మెరకముడిదాం మండలం,గుచ్చిమి కార్యదర్శి ఇమంది లక్ష్మి జామి మండలం, దాసరిపేట కార్యదర్శి ప్రసాద్ గజపతినగరం మండలంలోని గుడివాడకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఇతర మండలాల నుంచి బదిలీపై వచ్చిన వారు మంగళవారం విధుల్లో చేరుతారని పేర్కొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్ ఆదేశాలతో ఎస్ఐలు కృష్ణమూర్తి, మురళీలు తమ సిబ్బందితో వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ క్రమంలో నగరంలోని లంకాపట్నం, గాజులరేగ, దాసన్నపేట రింగ్ రోడ్డు, వ్యాసనారాయణ మెట్టరోడ్డు, కుమిలి రోడ్డు పరిసర ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న వారిని, మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వారిని గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఫ్రాన్సిస్కోలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రదర్శన



శాన్ ఫ్రాన్సిస్కో డీఏసీకి ప్రాతినిధ్యం వహించిన సీయూటీఎం ప్రతినిధులు

భువనేశ్వర్: సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ-మేనేజ్‌మెంట్ (సీయూటీఎం) అరుదైన ఘనత సాధించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రారంభమైన 62వ డిజైన్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్ (డీఏసీ)లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా తన సామర్థ్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఈ కాన్ఫరెన్స్ ఈ నెల 22న ప్రారంభమైంది, 25 వరకు కొనసాగనుంది. సెమీకండక్టర్, డిజైన్ ఆటోమేషన్ పరిశ్రమ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సెంచూరియన్ ప్రాతినిధ్యం వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'చిప్స్ టు సిస్టమ్స్' అనే శీర్షికతో నిర్వహిస్తున్న డీఏసీ కార్యక్రమానికి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ), సెమీకండక్టర్ టెక్నాలజీలు, సిస్టమ్ ఇన్నోవేషన్ రంగంలో దిగ్గజాలు హాజరు కావడం విశేషం. వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ దాస్, లక్ష్మీకాంత్ సుతార్‌లతో కూడిన బృందం సెంచూరియన్ తరపున ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డీఎన్ రావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వేదికపై సామర్థ్యాన్ని ప్రదర్శించిన తొలి వర్సిటీగా సెంచూరియన్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. వర్సిటీలో సెమీకండక్టర్ టెక్నాలజీ పాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మార్క్యూ సెమీకండక్టర్స్‌తో ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. విద్యతో పాటు సాంకేతిక ఆవిష్కరణల్లోనూ వర్సిటీ గుర్తింపు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అధునాతన పారిశ్రామిక రంగానికి అక్కరకు వచ్చే రీతిలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రపంచ స్థాయిలో సెంచూరియన్ తన ఉనికి చాటుకుంటుందని ఆశాభవం వ్యక్తం చేశారు.

జంఝావతి లిఫ్ట్ పనిచేసేలా చూడండి

- రైతులకు న్యాయం చేయండి : కాంగ్రెస్ నాయకులు



డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం టౌన్: కొమరాడ మండలంలో గల జంఝావతి ప్రాజెక్ట్‌కు సంబంధించి రబ్బర్ డ్యామ్ లిఫ్ట్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు వి. దాలినాయుడు, తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికలో డీఆర్‌ఓ కె. హేమలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాలినాయుడు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో జంఝావతి సాగునీరు రైతులకు అవసరమవుతాయన్నారు. రబ్బర్‌డ్యామ్ లిఫ్ట్‌ను బాగుచేస్తే సుమారు 24,640 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ పాడవ్వడంతో కొంతకాలంగా లిఫ్ట్ పనిచేయడం లేదని చెప్పారు. రైతులకు జంఝావతి నీరు అందించడంలో కూటమి నాయకులు, అధికారులు ఘోరంగా విఫలమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, పాలక రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'తోటపల్లి' నిర్వాసితులకు ఇళ్ల బిల్లులు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న రైతు సంఘ నాయకులు

పార్వతీపురం టౌన్: తోటపల్లి బ్యారేజీ నిర్వాసిత గ్రామాలైన పాతకల్లికోట, దుగ్గి గ్రామాలలో నిర్వాసితులు నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వాసిత రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఓ కె.హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితులు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇళ్లు నిర్మించుకున్నా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదన్నారు. రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. నిర్వాసిత మహిళలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మహిళలకు ప్యాకేజీ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దుగ్గి, పాతకల్లికోట, తోటపల్లి, పెద్దగెడ్డ నిర్వాసిత రైతులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓర్వలేకే మాజీ సీఎంపై కేసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిస్తోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇటీవల పల్నాడులో పర్యటించిన సమయంలో చీలి సింగయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ మరణించాడని, దీన్ని సాకుగా చూపి జగన్ మోహన్‌రెడ్డి, తదితరులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మండలంలోని బూరాడ గ్రామంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విషాదకరమైన ప్రమాదాలను కూడా రాజకీయం చేయడం తగదని సూచించారు. ప్రమాదవశాత్తూ జరిగిన మరణాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. బస్సు ప్రమాదాల్లో ఎవరైనా మరణిస్తే డ్రైవర్‌పై కేసు నమోదు చేయడం పరిపాటని.. అంతేకాకుండా బస్సులో ప్రయాణిస్తున్న వారందరిపై కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. పల్నాడు సంఘటనకు సంబంధించి లేనిపోని కథనాలను మీడియాలో చూపించి జగన్ మోహన్‌రెడ్డిని ఏ-2గా చేర్చడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, వావిలపల్లి శశిభూషణరావు, బంకి చంద్రశేఖర్, టంకాల ఉమాపాపినాయుడు, రణస్థలం రమాదేవి, రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా గౌరునాయుడు,జు, తదితరులు పాల్గొన్నారు.